
సాక్షి గుంటూరు

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు. పలు కాలువలకు 1932 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.1097 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

స్కూల్ గేమ్స్ సైక్లింగ్ పోటీలు ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో భాగంగా గురువారం డీఎస్‌ఏ స్టేడియం నిర్వహణలో అండర్–14 బాలబాలికల సైక్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి చప్పిల్లి కోటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు పి.కోటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న తలపాగా ఊరేగింపు



వేటపాలెం: పందిళ్లపల్లిలో చేనేత మగ్గంపై నేసిన శ్రీశైల మల్లన్న తలపాగాకు గురువారం వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేసి ప్రత్యేక అలంకరణతో వేడుక జరిపారు. గ్రామ ప్రజలు మల్లన్న తలపాగాకు హారతులిచ్చారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, బండ్ల బాబు, ఏరాసు అరుణ్ బాబు, బుసం శ్రీనివాసరావు, చింతా రాము, ఒలుకుల రామంజనేయులు, కర్ణ పోలయ్య, కోనంకి నాగేశ్వరరావు, ఏరాజు బసవేశ్వరరావు పాల్గొన్నారు.

యార్డులో 1,36,092 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,32,084 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,36,092 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,200 నుంచి రూ.12,000 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,327 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఐదు మండలాలకు ఎంఈవోల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలకు తాత్కాలిక ప్రాతిపదికన ఎంఈవోలను నియమిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఐదు మండలాలకు ఎంఈవోలను ఎఫ్‌ఏసీలుగా బాధ్యతలు అప్పగించారు. రెంటచింతల ఎంఈవోగా గురజాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్వీఆర్ ప్రసాద్, యడ్లపాడు ఎంఈవోగా చిలకలూరిపేట ఎంఈవో కె.లక్ష్మి, అమరావతి ఎంఈవోగా పెదకూరపాడు ఎంఈవో వై.ప్రసాదరావు, పిడుగురాళ్ల ఎంఈవోగా రాజుపాలెం ఎంఈవో బి.మల్లికార్జునశర్మ, నూజెండ్ల ఎంఈవోగా వినుకొండ ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లాను నియమించారు. పరిపాలన సౌలభ్యం కోసం ఆయా మండలాలకు 25 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న హెచ్‌ఎం, ఎంఈవోలకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగ్గురు జేసీజేల నియామకం

గుంటూరు లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా నూతన జూనియర్ సివిల్ జడ్జిల నియామకాలు, మరికొంత మంది జేసీజేలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఇనపకుర్తి స్వాతిని నూతనంగా నియమించారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై రానున్నారు. గొల్లపూడి స్రవంతిని గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టుకు నూతన జడ్జిగా నియమించారు. వీరు త్వరలోనే విధుల్లో చేరనున్నారు.

కొండపై ఏకాదశి సందడి



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



బాలప్రభలతో కొండకు వస్తున్న భక్తులు

త్రికోటేశ్వరుడిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

- కొండపై భక్తుల రద్దీ
- రుద్రహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తుల సందడి నెలకుంది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున స్వామి వారికి బిందె తీర్థంతో అభిషేకాలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయంలో భక్తుల రద్దీ నెలకుంది. ఉచిత దర్శనంతో పాటు శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శన సదుపాయాలను భక్తులకు కల్పించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో మూలవిరాట్ అభిషేకాలు నిలిపివేశారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొన్నారు. సోపాన మార్గంలో భక్తులు పెద్ద ఎత్తున మెట్లపూజ చేసుకుంటూ కొండపైకి చేరుకున్నారు. ఆలయం వెనుక ఉన్న రావి చెట్టు వద్ద మహిళలు పూజలు చేశారు. ధ్యానశివుడు, నాగేంద్రుడి పుట్ట వద్ద భక్తుల రద్దీ కనిపించింది. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను కొండపైకి నడిపింది. ఘాట్ రోడ్డులోని ప్రకృతి పర్యావరణ కేంద్రం, కొండ దిగువన ఉన్న జలవిహార్ వద్ద యాత్రికులు ఆహ్లాదంగా గడిపారు. రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్‌ఐలు బాలనాగిరెడ్డి, హజరత్తయ్య బందోబస్తును పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశాయి.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు..

కొండపైన ఆలయం ప్రాంగణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. చిలకలూరిపేటకు చెందిన భక్తులు తేళ్ల శ్రీధర్, తేళ్ల సుధీర్ సహకారంతో రూ.1.6 కోట్లతో నిర్మించిన అన్నదాన మండపం, రూ.40 లక్షలతో ప్రధాన ఆలయం చుట్టూ నిర్మించిన రేకుల షెడ్డు, రూ.47 లక్షలతో నిర్మించిన డార్మెంటరీ, రూ.70 లక్షలతో చేపట్టిన వసతి గృహం ఆధునికీకరణ పనులకు ప్రారంభోత్సవం నిర్వహించారు. కొండ దిగువన జలవిహార్ వద్ద రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ సహకారంతో నిర్మించిన లక్ష్మీవిజయం కళావేదికను ప్రారంభించారు. ముందుగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలోని యాగశాలలో నిర్వహించిన రుద్రహోమం, మేధా దక్షిణామూర్తి హోమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ సుస్మితారెడ్డి, కంజుల రామకోటిరెడ్డి దంపతులు, తహసీల్దార్ రమణానాయక్ దంపతులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

25 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

తిరునాళ్లకు 25 లక్షలు నుంచి 30 లక్షల వరకు భక్తులు కోటప్పకొండకు వస్తారని అంచనా వేస్తున్నాం. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం. రోడ్ల విస్తరణతో పాటు పలు రహదారులకు మరమ్మతులు పూర్తిచేయడం జరిగింది. గతంలో జరిగిన చిన్నచిన్న లోపాలను అధిగమించి తిరునాళ్లను విజయవంతం చేస్తాం.

– లోతేటి శివశంకర్, జిల్లా కలెక్టర్

తిరునాళ్ల ఏర్పాట్లు పూర్తి

రాష్ట్రం నలుమూలల నుంచి తిరునాళ్లకు తరలి వచ్చే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సామాన్య భక్తులు ప్రశాంతంగా స్వామి వారిని దర్శించుకుని గమ్యస్థానానికి తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి రోడ్ల విస్తరణ చేపట్టి పనులు పూర్తిచేయడం జరిగింది. తాగునీరు, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఏర్పాటు చేశాం.

– డాక్టర్ గోపిరెడ్డి, ఎమ్మెల్యే

కొండకు తరలిన భారీ ప్రభలు

నరసరావుపేట రూరల్: కోటయ్య సన్నిధిలో కొలువుదీరేందుకు మండలంలోని కాకాని, గురవాయపాలెం గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు భారీ విద్యుత్ ప్రభలు గురువారం కోటప్పకొండకు బయలుదేరాయి. కాకాని గ్రామం నుంచి పద్నాలుగేళ్లుగా కోటప్పకొండకు ప్రభను తరలిస్తున్నారు. 90 అడుగుల భారీ విద్యుత్ ప్రభను బుధవారం రథంపై నిలబెట్టారు. గురువారం మధ్యాహ్నం ప్రభను కొండకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభ ట్రాక్టర్‌ను నడిపారు. గ్రామస్తులు ఉత్సాహంగా ప్రభను తరలించే కార్యక్రమంలో పాల్గొన్నారు. చేదుకో కోటయ్య చేదుకో అంటూ శివనామస్మరణ చేస్తూ ప్రభను ముందుకు కదిలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచేటి వీరనారాయణ, మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, సర్పంచ్ అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గురవాయపాలెం నుంచి విద్యుత్ ప్రభ మధ్యాహ్నం 3 నుంచి కోటప్పకొండకు బయలుదేరింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూజలు నిర్వహించిన అనంతరం ప్రభను కొండకు తరలించారు. ప్రభ ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి నడిపారు.



గురవాయపాలెం ప్రభ ట్రాక్టర్‌ను నడపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అభివృద్ధి దారులు



పశ్చిమ బైపాస్ నిర్మాణం



కొత్తగా ప్రతిపాదించిన తూర్పు బైపాస్ మ్యాప్

- జిల్లాలో రెండు బైపాస్‌లు, మరో రెండు హైవేలకు ప్రతిపాదనలు
- కాజా నుంచి చినవుటుపల్లి వరకూ తూర్పు బైపాస్
- ఇప్పటికే వేగంగా జరుగుతున్న చిన్నకాకాని టూ గొల్లపూడి పశ్చిమ బైపాస్ పనులు
- పేరేచర్ల టూ నిజాంపట్నం, వినుకొండ టూ గుంటూరు కొత్త హైవేలకు ప్రతిపాదనలు
- భూసేకరణకు రంగం సిద్ధం
- మారనున్న గుంటూరు జిల్లా రూపురేఖలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లా అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. కొత్తగా రెండు బైపాస్‌లు, రెండు కొత్త హైవేల ప్రతిపాదనలతో గుంటూరు జిల్లా రూపురేఖలు మారనున్నాయి. జాతీయ రహదారి–16లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా గుండుగొలను నుంచి గుంటూరు జిల్లాలోని కాజా వరకూ ఆరు వరుసల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. దీన్ని విజయవాడ బైపాస్‌గా పిలుస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే చెన్నై – కోల్‌కత్తా, హైదరాబాద్ – కోల్‌కత్తా, హైదరాబాద్ – చెన్నై వెళ్లే వాహనాలు విజయవాడ నగరంలోకి రాకుండానే వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది. దీనివల్ల విజయవాడ నగరంలో ట్రాఫిక్ తగ్గడమే కాకుండా బైపాస్‌కు ఇరువైపులా అభివృద్ధికి బాటలు పడనున్నాయి. విజయవాడకు పశ్చిమ బైపాస్ నిర్మాణం కోసం గొల్లపూడి నుంచి చినకాకాని వరకూ, తూర్పు బైపాస్ కోసం చినకాకాని నుంచి పొట్టిపాడు వరకూ డిజైన్ చేశారు. విజయవాడ బైపాస్ నిర్మాణంలో భాగంగా చిన్నఅవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. చినఅవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు పనులను మేఘా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. ఈ పనులు చాలా వరకూ పూర్తయ్యాయి. దీనికి అనుసంధానంగా గొల్లపూడి నుంచి కాజా (చినకాకాని) వరకూ 18 కిలోమీటర్ల రహదారి పనులను అదానీ ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకుంది. 1,546 కోట్ల రూపాయలతో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే చినకాకాని నుంచి రోడ్డు పనులు, అండర్ పాస్, ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం అయ్యాయి. ఈ ప్యాకేజీలో కృష్ణా నదిపై ఆరు వరుసల రహదారితో కూడిన వంతెన నిర్మించనున్నారు. ఆరు లైన్ల జాతీయ రహదారి మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థలోని చినకాకాని గ్రామం నుంచి ప్రారంభమై మంగళగిరి, నవులూరుతో పాటు రాజధాని పరిధిలోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం, మందడం మీదుగా కృష్ణా జిల్లా గొల్లపూడి వద్ద కలుస్తుంది. కృష్ణా నదిపై నిర్మించనున్న 3.2 కిలోమీటర్ల వంతెన తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద ప్రారంభమై కృష్ణా జిల్లా సూరాయపాలెం వద్ద ముగుస్తుంది.

తాజాగా తూర్పు బైపాస్‌కు ఆమోదం

తాజాగా తూర్పు బైపాస్ పనులకు రంగం సిద్ధం చేస్తున్నారు. చినకాకాని నుంచి కృష్ణా జిల్లా పొట్టిపాడు జాతీయ రహదారి వరకు తూర్పు బైపాస్‌ను ఏర్పాటు చేయనున్నారు. చినకాకాని నుంచి మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల మీదుగా కృష్ణా నదిపై వంతెన నిర్మించి గన్నవరం దాటిన తర్వాత ఉన్న పొట్టిపాడు వరకూ ఈ బైపాస్ అలైన్‌మెంట్‌ను ప్రతిపాదించారు. దీనికోసం గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో సుమారు 19.750 కి.మీ. పొడవు, ఆరు లైన్ల వెడల్పుకు భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. ప్రతిపాదిత ఎలైన్మెంట్‌ను ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఇటీవల జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ బైపాస్ పూర్తయితే మచిలీపట్నం పోర్టుకు కూడా దగ్గర అవుతుంది.

కొత్తగా రెండు హైవేల అభివృద్ధి..

జిల్లాలో రెండు హైవేలను అభివృద్ధి చేయనున్నారు. గుంటూరు – నారాకోడూరు– తెనాలి – చందోలు– నిజాంపట్నం పోర్టు రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టును చైతన్య ప్రాజెక్టు కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. గుంటూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకూ ఈ రోడ్డును మొత్తం 51.490 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తారు. పల్నాడు జిల్లా వినుకొండ నుంచి బాపట్ల జిల్లా సంతమాగులూరు మీదుగా గుంటూరుకు ప్రస్తుతం ఉన్న రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. 91.375 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును విస్తరిస్తారు. ఈ పనులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అస్సిస్టమ్ఎస్‌టీయూపీ సంస్థకు అప్పగించారు. గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 33.68 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు జరగనున్నాయి. కొండమూడు నుంచి పేరేచర్ల వరకూ కొత్త జాతీయ రహదారి పనులు కూడా ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో భూసేకరణ చేయనున్నారు.

శరవేగంగా భూసేకరణ



జిల్లా పరిధిలో జాతీయ రహదారుల విస్తరణ కోసం భూసేకరణ వేగవంతం చేశాం. పశ్చిమ బైపాస్‌కు భూసేకరణ పూర్తయి పనులు జరుగుతున్నాయి. తాజాగా తూర్పు బైపాస్ కోసం భూసేకరణ కోసం అన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేశాం. వినుకొండ – గుంటూరు, గుంటూరు – నిజాంపట్నం పోర్టు, కొండమూడు– పేరేచర్ల జాతీయ రహదారుల విస్తరణ కోసం కూడా భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. త్వరలోనే భూసేకరణ పూర్తి చేస్తాం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్

ట్రాఫిక్ సమస్య లేకుండా పటిష్ట చర్యలు

- ఆర్టీసీ బస్సులకు సైతం ఈ ఏడాది వన్‌వేలను ప్రవేశపెట్టాం
- సుమారు 2,500 మంది సిబ్బందితో తిరునాళ్ల విధులు
- మహిళా పోలీసుల ద్వారా ప్రజలకు ట్రాఫిక్ రూట్లపై అవగాహన
- ప్రొటోకాల్ దర్శనాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటు
- మీడియా సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: శివరాత్రి రోజు కోటప్పకొండ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయాలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. త్రికోటేశ్వరస్వామి ఉత్సవాల నేపథ్యంలో పోలీస్‌శాఖ తరపున చేసిన ఏర్పాట్లపై గురువారం ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది కొత్తగా రోడ్లను ఏర్పాటు చేసి వన్‌వేలను ప్రవేశపెట్టామన్నారు. దీంతో చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ ఏడాది కోటప్పకొండ పార్కింగ్ యాప్‌ను రూపొందించామని, దీన్ని భక్తులు వినియోగించుకోవాలని తెలిపారు. రూట్లు, పార్కింగ్, యాప్ తదితర సమాచారాన్ని మహిళా పోలీసుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది కొత్తగా ప్రొటోకాల్ దర్శనానికి ప్రత్యేక లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 2,500 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారని తెలిపారు. సెల్‌ఫోన్ నెటవర్క్ సమస్యలు రానున్న నేపథ్యంలో ఆయా కంపెనీల నుంచి తాత్కాలికంగా కొన్ని టవర్లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు సేవించడం నిషిద్ధమన్నారు, రాజకీయ, వర్గాల సంబంధిత సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనుమతి లేదన్నారు. కాలినడక భక్తులకు ఘాట్‌రోడ్డుపై అనుమతి లేదని, కేవలం మెట్ల మార్గంలోనే వెళ్లాలని సూచించారు. ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే కొండపైకి అనుమతిస్తున్నామన్నారు. ఎక్కడైనా వాహనాలు నిలిచిపోతే క్రేన్లతో పక్కకు తప్పించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీలు బిందుమాధవ్, రామచంద్రరాజు, డీఎస్పీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లలో విధులు నిర్వహించనున్న పోలీస్ సిబ్బంది

ఏఎస్పీలు	ముగ్గురు
డీఎస్పీలు	20 మంది
సీఐలు	50 మంది
ఎస్‌ఐలు	150 మంది
ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు	500 మంది
పోలీస్ కానిస్టేబుళ్లు	800 మంది
మహిళా కానిస్టేబుళ్లు	90 మంది
హోంగార్డులు	650 మంది
ఏఎస్ఎస్, ఇతర సిబ్బంది	230 మంది

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్లు ఉగాది నాటికి వీలైనన్ని పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు వారాల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి చేయాల్సిన పనులను పకడ్బందీగా రూపొందించుకుని అమలు చేయాలన్నారు. పూర్తయిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు, నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చే విధంగా చూడాలన్నారు.

ఫిష్ ఆంధ్రాను ప్రోత్సహించండి..

కలెక్టర్ మాట్లాడుతూ ఫిష్ ఆంధ్రాకు సంబంధించి ప్రభుత్వ సూచనలు పాటించాలన్నారు. బహుళ ప్రయోజనాలు కలిగే ఈ కార్యక్రమాన్ని అధికారులు ప్రోత్సహించాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో లబ్ధిదారులకు కావాల్సిన స్థలాలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు సహకరించాలని చెప్పారు. వ్యాపారం ఎక్కడ బాగుంటుందో చూసి వారికి అక్కడ ఏర్పాటు చేస్తే మంచిదని చెప్పారు. లబ్ధిదారుల సూచనలు, సలహాలు కూడా స్వీకరించాలన్నారు. అక్షయ పాత్ర అందిస్తున్న మధ్యాహ్న భోజనం కొంత మంది విద్యార్థులు తినడంలేదని వస్తున్న విషయాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరిశీలించాలన్నారు. క్వాలిటీ ఫుడ్ అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వివిధ సబ్జెక్ట్స్ బోధించే టీచర్స్ ఇంకా విధుల్లో చేరకపోతే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, డీఈఓ శైలజ, హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెగా భ్రమరాంబ, మల్లేశ్వరస్వామివార్లు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో (పెదకాకాని శివాలయం)లో గురువారం మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మల్లేశ్వరస్వామిని పెండ్లి కుమారుడిగా భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. భ్రమరాంబాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. తొలి రోజు పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 5:30 గంటలకు కోటు యలమందారెడ్డి బృందం భజన కాలక్షేపం, 6:30 గంటలకు పెదకాకాని జితదాస్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం, 8:30 గంటల నుంచి శ్రీకృష్ణరాయభారం నాటకంలో పడకసీను, గయోపాఖ్యానం నాటకం నుంచి వార్‌సీను, సీతాకల్యాణం నాటకం సీన్లు ప్రేక్షకులను అలరించాయి. శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని వనదుర్గాదేవిగా అలంకరించడం జరుగుతుందని, ప్రత్యేక స్టేజిపై రామలింగ ప్రతిష్ఠ ఉంటుందని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాట్లను దేవదాయశాఖ ఉప కమిషనర్ ఈమని చంద్రశేఖర రెడ్డి పరిశీలించారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాదాన్ని ప్రారంభించారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం



పిడుగురాళ్ల క్రేజీబాయ్స్ టీమ్‌తో గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

పిడుగురాళ్ల: శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అన్నారు. పట్టణంలోని భారత వనిత వార పత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కార్క్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారానికి ఐదో రోజుకు చేరాయి. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. నేడు యువత టెన్నిస్ బాల్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, కార్క్ బాల్ కూడా ఆదరణ కలిగే క్రీడాకారులు ఆడటం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలలో రాణించిన వారికి 2 శాతం రిజర్వేషన్ కూడా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జిల్లా పరిశ్రమల అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూరుమూల గ్రామాల్లో ఉన్న క్రీడాకారులు ఇలాంటి టోర్నమెంట్‌లు ఆడటం వలన ఎంతగానో గుర్తింపు వస్తుందని, దాని వలన నేషనల్ లెవల్‌లో ఆడవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మాచవరం జెడ్పీటీసీ సభ్యుడు జువ్వెన బోయిన శివాయాదవ్, టోర్నమెంట్ నిర్వాహకులు వనిత శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, నాయక్, నిరంజన్, రత్నం, రవి, స్కాలర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జనార్దన్, పిడుగురాళ్ల మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ పాల్గొన్నారు.

19న ప్రీ-టెక్నికల్ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు సెంటర్ టైప్, షార్ట్‌హ్యాండ్-కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న ప్రీ-టెక్నికల్ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు టీవీఎస్ ప్రకాష్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 3/9లోని మాస్టర్‌మైండ్స్ సత్యభవన్ క్యాంపస్‌లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9394111606, 9346224443లో సంప్రదించాలని సూచించారు.

కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థానం

● ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ● రెండోరోజు కొనసాగిన విజ్ఞాన్ మహోత్సవ్-2కే23



వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మాట్లాడుతున్న ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి పక్కన హీరోయిన్ సంయుక్త మీనన్



విద్యార్థులను ఉత్సాహ పరిచేందుకు డ్యాన్స్ చేస్తున్న హీరో కార్తికేయతో పాటు హీరోయిన్ నేహాశెట్టి

చేబ్రోలు: నిరంతర కృషి, కష్టపడి పనిచేస్తే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్-2కే23 కార్యక్రమం గురువారానికి రెండో రోజుకు చేరింది. వెంకీ అట్లూరి మాట్లాడుతూ సాధించలేనేమో అనే భయం, సందేహాలకు జీవితంలో ఎప్పుడూ కూడా తావివ్వొద్దని సూచించారు. డబ్బుతో సాధించలేనివి ఎన్నో ప్రేమ, మన్నింపు, ధైర్యంతో సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 17న విడుదల కాబోతున్న '' ధనుష్ సార్'' సినిమాను విద్యార్థులందరూ ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని విద్యార్థులను కోరారు. హీరోయిన్ సంయుక్త మీనన్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

ప్రముఖ సినీ హీరో కార్తికేయ సందడి

విజ్ఞాన్ మహోత్సవ్-2కే23లో రెండో రోజు ప్రముఖ సినీ హీరో కార్తికేయ గురువారం తన ''బెదురులంక 2012'' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సందడి చేశారు. హీరో కార్తికేయతో పాటు హీరోయిన్ నేహాశెట్టి పాల్గొన్నారు. ప్రముఖ సినీ హీరో కార్తికేయ మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా కొత్తగా ప్రయత్నించాలంటే గ్రాడ్యుయేషన్ సమయయే సరైనదన్నారు. హీరోయిన్ నేహాశెట్టి హాజరయ్యారు. బెదురులంక 2012 సినిమా హీరో కార్తికేయ, హీరోయిన్ నేహాశెట్టి విద్యార్థులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు.

ఉత్సవాల ముగింపు నేడు

విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా 82 ఈవెంట్లలో నిర్వహిస్తున్న పోటీలన్నీ సెమీ ఫైనల్స్‌కు చేరాయి. శుక్రవారం చివరి రోజు ఫైనల్స్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, గౌరవ అతిథిగా ఐఎస్‌పీఏ డైరెక్టర్, ఐఏఏఎఫ్ లెవల్-1 కోచ్, ఇంటర్నేషనల్ అథ్లెట్ డాక్టర్ ఆర్.నటరాజన్ (ఐఆర్ఎస్) హాజరవుతారని విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ పీ.నాగభూషణ్ తెలిపారు.

తెనాలి సినీ హీరో కార్తికేయ సందడి

తెనాలి అర్బన్: సినీ హీరో కార్తికేయ గురువారం తెనాలిలో సందడి చేశారు. ఆయన నటించిన బెదురులంక సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆయన తెనాలి వచ్చారు. ఆయనకు అభిమానులు వీఎస్సార్ కళాశాల వద్ద ఘనస్వాగతం పలికి అక్కడి నుంచి గౌతమ్ గ్రాండ్ హోటల్ వరకు ర్యాలీగా తీసుకువచ్చారు.

పలువురు వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్స్‌గా పనిచేస్తున్న పలువురు వైద్యులు ప్రొఫెసర్స్‌గా పదోన్నతి లభించింది. బుధవారం రాత్రి విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్(డీఎంఈ) కార్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్స్‌గా ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి ప్రొఫెసర్స్‌గా ఉత్తర్యులు ఇచ్చారు. గుంటూరు వైద్య కళాశాల అనాటమి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చిటితోటి సుధాకర్‌బాబుకు ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల అనాటమి విభాగాధిపతిగా పదోన్నతి లభించింది. ఆయన గురువారం గుంటూరు నుంచి రిలీవ్ అయ్యారు. పిల్లల వైద్య విభాగంలో అసోసియేట్‌గా పనిచేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొంది గుంటూరు జీజీహెచ్‌లోనే విధుల్లో చేరారు. రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ విజేత ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది గుంటూరు జీజీహెచ్‌లోనే విధుల్లో చేరారు. ఫార్మకాలజీ అసోసియేట్‌గా పనిచేస్తున్న డాక్టర్ పద్మావతి ప్రొఫెసర్‌గా ప్రమోషన్ తీసుకుని విధుల నుంచి రిలీవ్ అయ్యి ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీపై వెళ్లారు. పెథాలజీ వైద్య విభాగం అసోసియేట్ డాక్టర్ శ్రీధర్‌కు ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్‌గా ప్రమోషన్ వచ్చింది. ఆర్థోపెడిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అద్దెపల్లి శ్రీనివాస్, రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ధనలక్ష్మి, ఫిజియాలజీ అసోసియేట్ డాక్టర్ పద్మలకు ప్రొఫెసర్స్‌గా ప్రమోషన్ వచ్చింది. గుంటూరులో ప్రొఫెసర్స్‌గా ప్రమోషన్ వచ్చిన వైద్యులు వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమా జ్యోతిని కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. ప్రొఫెసర్స్‌గా ప్రమోషన్ పొందిన వైద్యులకు కళాశాల అధికారులు, పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

భూముల రీ సర్వే పూర్తి చేస్తాం

కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి

గుంటూరు వెస్ట్: భూముల రీ సర్వే ప్రక్రియ అనుకున్న సమయానికే పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇళ్లను వీలైనంత వరకు ఉగాదికి పూర్తి చేస్తామని చెప్పారు. దీనికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని వివరించారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివ రామిరెడ్డి, గుంటూరు ఆర్డీఓ ప్రభాకర రెడ్డి, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, డీఈఓ శైలజ, హౌసింగ్ పీడీ సాయినాథ్ కుమార్, డీఆర్డీఏ పీడీ హరిహర నాథ్ పాల్గొన్నారు.

యువకుడిది హత్యే..

● తొలుత అనుమానాస్పద మృతిగా కేసు
● డబ్బుల కోసం హత్య చేసిన ఆటో డ్రైవర్లు
● నిందితులు పట్టణానికి చెందిన వారుగా గుర్తింపు



సురేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు(ఫైల్)

తెనాలి రూరల్: అనుమానాస్పద మృతి కేసు హత్య కేసుగా మార్పు చేశారు. మృతుడి ఖాతాలో ఉన్న నగదును తీసుకునే క్రమంలో ఘర్షణ పడి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తెనాలి మండలం కొలవరంలోని చెరువులో ఈ నెల 6వ తేదీన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ఆ చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడి జేబులో ఉన్న ఐడీ కార్డుల ఆధారంగా గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన శ్రీకాంత్(30)గా గుర్తించారు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

సీసీ ఫుటేజ్‌లతో క్లూ..

కేసు ఛేదించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన ఎస్ఐ వెంకటేశ్వర్లు 5వ తేదీ రాత్రి పట్టణంలో వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. శ్రీకాంత్‌కు మద్యం అలవాటు ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌ల సీసీ ఫుటేజీలను నిశితంగా పరిశీలించారు. శ్రీకాంత్‌ను ఇద్దరు ఆటో డ్రైవర్లు తీసుకెళ్లినట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. మరో వైపు శ్రీకాంత్ కాల్ లిస్ట్‌ను పరిశీలించారు. వీటి ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను తెనాలి వైకుంఠపురం, చినరావూరుతోట ప్రాంతాలకు చెందిన ఇద్దరు ఆటో డ్రైవర్లుగా గుర్తించారు. ఇద్దరిని విచారించినట్లు సమాచారం. మార్కెట్‌లోని ఓ బార్ వద్ద నిందితుల ఆటోలో శ్రీకాంత్ కూర్చుని ఉన్నాడు. అప్పుడే బార్‌లో మద్యం తాగి వచ్చిన నిందితులు శ్రీకాంత్‌ను గద్దించారు. ఎందుకు తిడతారు రండి కలిసి మద్యం తాగుదామని చెప్పి తీసుకెళ్లి తనతో పాటు వారిద్దరికీ మద్యం కొనుగోలు చేశాడు. బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును ఫోన్‌పే ద్వారా శ్రీకాంత్ వాడుతున్నాడని గ్రహించిన నిందితులు అతడి వద్ద ఉన్న నగదును తమ ఫోన్‌పేకు బదిలీ చేయించుకోవాలని చూశారు. కొలవరం తీసుకెళ్లి అక్కడా మద్యం తాగించి, తమకు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ తప్పుడు పాస్‌వర్డ్ చెప్పడంతో ఆగ్రహంతో అతడిపై దాడి చేశారు. మృతి చెందిన అతడిని చెరువులోకి నెట్టేసి అక్కడి నుంచి జారుకున్నారు. హత్యకు పాల్పడిన నిందితులు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

మద్యం సీసాలు విక్రయించే వ్యక్తి అరెస్ట్



మాట్లాడుతున్న ఏఎస్పీ సుప్రజ, పక్కన సూపరింటెండెంట్ అన్నపూర్ణ

నగరంపాలెం: ఆర్మీ మద్యం సీసాలను అనధికారికంగా విక్రయించే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) గుంటూరు -2 పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.1.80 లక్షల ఖరీదు చేసే 98 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని ఎస్ఈబీ -గుంటూరు 2 స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఈబీ జిల్లా ఇన్‌చార్జి ఏఎస్పీ కె.సుప్రజ వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో ఈనెల 15న పండరీపురం 4వ వీధిలోని వై.హనిమిరెడ్డి ఇంట్లో ఎస్ఈబీ గుంటూరు -2 స్టేషన్ సీఐ కర్ణ, సిబ్బంది సోదాలు నిర్వర్తించారు. ఈ క్రమంలో వివిధ బ్రాండ్‌లకు సంబంధించి 98 ఆర్మీ మద్యం (మిలటరీ) సీసాలను గుర్తించారు. దీంతో హనిమిరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. గుంటూరు నగరంలోని సాయినగర్, పాత గుంటూరుకి చెందిన మాజీ విశ్రాంత ఉద్యోగుల వద్ద మద్యం సీసాలు కొనుగోలు చేసేవారని దర్యాప్తులో వెల్లడైంది. దీంతో హనిమిరెడ్డిని అరెస్ట్ చేసి రూ.1.80 లక్షల విలువ చేసే 98 ఆర్మీ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ చెప్పారు.మరో ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ, సీఐ కర్ణ, ఎస్ఐ కల్యాణ్ చక్రవర్తి, కానిస్టేబుళ్లు పూర్ణ, శ్రీనివాసరెడ్డి, చిన్న ఆంజనేయులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వనాథ సంస్కృతి పురస్కారం ప్రదానం



పెదకాకాని: సమాజానికి ఎంతో మేలు చేసే కళలను యువతకు తెలియజేసి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విశ్వనాథ సాహిత అకాడమీ ఆధ్వర్యంలో విశ్వనాథ సంస్కృతి పురస్కారాల ప్రదానం గురువారం నిర్వహించారు. వేడుకకు వీవీఐటీ విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విశ్వనాథ సాహిత్య అకాడమి చైర్మన్ డాక్టర్ మద్దినేని సింహకోటిల్య చౌదరి, సాహితీవేత్త బూసురేపల్లి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 2022 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ప్రముఖ తోలుబొమ్మలాట కళాకారులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు అయిన సిందె కుళాయప్ప, వెంకటమ్మలకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ జానపద కళలు నైతిక సూత్రాలను, విలువలను కథల ద్వారా తెలియపరుస్తాయన్నారు. కొన్ని తరాలుగా తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తున్నామన్నారు. అనంతరం ప్రదర్శించిన సుందరకాండ తోలుబొమ్మలాట అబ్బురపరచింది. కార్యక్రమంలో వివా డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, రవికృష్ణ పాల్గొన్నారు.